ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 3 మార్చి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	215	244
సూర్యాపేట	రూ.165	230	260
నల్లగొండ	రూ.148	215	244

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.6

మూడోసారి బరిలోకి

- భువనగిరి నుంచి మాజీ ఎంపీ బూరకు ఛాన్స్
- పుట్టినరోజు బహుమతిగా ఎంపీ టికెట్
- పార్టీ మార్పుతో కలిసొచ్చిన అవకాశం
- బంగారు భువనగిరిగా మారుస్తా: మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



యాదాద్రి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్ఠానం విడుదల చేసింది. ఊహించినట్టుగా తొలిజాబితాలోనే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌కు పోటీ చేసే అవకాశం కల్పించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో వైద్యుల సంఘాల జేఏసీ తరఫున పలు ఆందోళనలు చేపట్టిన నర్సయ్యగౌడ్‌ను ఉద్యమకారుడిగా గుర్తించి 2014లో బీఆర్ఎస్ అధిష్ఠానం భువనగిరి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. 2014లో భువనగిరి ఎంపీగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై పోటీ చేసి గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి, ప్రస్తుతం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బీజేపీ అధిష్ఠానం తొలిజాబితాలో ప్రకటించిన తొమ్మిది స్థానాలను అత్యంత ప్రాధాన్యంగా భావిస్తోంది. భువనగిరి నియోజకవర్గం సెమీ అర్బన్, గ్రామీణప్రాంతాల్లో కూడి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అధికంగా అవకాశాలు ఉంటాయని భావించి, బలమైన సామాజిక వర్గం నేతను అభ్యర్థిగా ఎంపిక చేసినట్టుగా తెలుస్తోంది. భువనగిరి నియోజకవర్గం మొత్తం ఐదు జిల్లాల పరిధిలో ఉంటుంది. యాదాద్రి భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో, అదేవిధంగా నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు నియోజకవర్గాలు పాక్షికంగా(నల్లగొండ, సూర్యాపేటజిల్లాల పరిధిలో) ఉంటాయి. రంగారెడ్డిజిల్లాలోని ఇబ్రహీంపట్నం, జనగాం జిల్లాలోని జనగాం అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్నాయి. అయితే బూర నర్సయ్యగౌడ్ గతంలో ఎంపీగా పనిచేసిన అనుభవంతో పాటు గతఎన్నికల్లోనూ పోటీ చేశారు. రెండు దఫాలుగా ఎంపీగా పోటీలో ఉన్నందున ఆయన అనుభవం ఈ ఎన్నికల్లో ఉపయోగపడుతుందని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది.

పార్టీ మార్పుతో కలిసొచ్చిన అవకాశం...

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరడంతో ఎంపీగా పోటీ చేసే అవకాశం కలిసొచ్చింది. కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ క్రమంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నిక సమయంలో రాజకీయంగా భారీగా వలసలు చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలు ఇతర పార్టీల్లోని సీనియర్ నేతలతో పాటు ప్రజాప్రతినిధులను చేర్చుకునేందుకు నిమగ్నమయ్యాయి. ఈ ఎన్నికను ఇరుపార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మునుగోడు నియోజకవర్గంలో గౌడ సామాజిక వర్గ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈనేపథ్యంలో అప్పటికే బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానంతో పాటు అప్పటి జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డితో అంటీముంటనట్టుగా ఉండటంతోపాటు...పలుమార్లు సొంత పార్టీ నేతలపై బూర నర్సయ్యగౌడ్ విమర్శలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయనపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తే తాను బీజేపీ చేరుతానని అధిష్ఠానంతో చర్చలు జరిపారు. ఎంపీగా సీటు కేటాయించేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నాలు చేస్తామని పార్టీ రాష్ట్ర నేతలు హామీ ఇవ్వడంతో ఆయన బీజేపీ గూటికి చేరారు. అప్పటి నుంచి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పలుకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందరూ ఊహించిన విధంగానే బూర నర్సయ్యగౌడ్‌కు ఎంపీ టికెట్ ఖరారు చేసింది.

పుట్టిన రోజు కానుకగా ఎంపీ టికెట్...

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ శనివారం భువనగిరిలో తన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భువనగిరి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానించారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, జనగాం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు కదలొచ్చారు. అధిష్ఠానం కూడా ఊహించినట్టుగానే బూర పుట్టిన రోజునే తొలిజాబితాను ప్రకటించింది. ఒక రకంగా బీజేపీ అధిష్ఠానం ఎంపీ టికెట్ తొలిజాబితాలోనే ప్రకటించడంపై పుట్టినరోజు కానుకగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈసందర్భంగా ఆయన అనుచరులు పెద్దఎత్తున ఆనందం వ్యక్తం చేశారు.


బంగారు భువనగిరిగా మారుస్తా:

లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే బంగారు భువనగిరిగా మారుస్తానని బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. తాను గతంలో ఎంపీగా పనిచేసిన సందర్భంలో రూ.9వేల కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. కేంద్రంలో మోదీ సహకారంతో మరిన్ని నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీగా ఉన్నప్పుడే ఎయిమ్స్, ఎంఎంటీఎస్, కేంద్రీయ విద్యాలయ వంటి ఎన్నో సంస్థలు నెలకొల్పేందుకు కృషిచేశానని తెలిపారు.నియోజకవర్గం ప్రజల అండదండలతోపాటు బీజేపీ జాతీయ,రాష్ట్ర నేతల సహకారంతో తనకు ఎంపీ టికెట్ లభించిందని, తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

\- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధి మొత్తాన్ని కలుపుతూ హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆలోచనలు కార్యరూపం దాలిస్తే జిల్లా సమగ్ర స్వరూపం మారనుంది. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు కార్పొరేషన్లు, 30మునిసిపాలిటీలను విలీనం చేస్తూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుకు కసరత్తు చేయాలని సీఎం ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు కార్యాచరణ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ పరిధిలోకి రానున్న మండలాలన్నింటినీ హెచ్ఎండీఏలో చేర్చాలని ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలతో జిల్లాలోని మరో మూడు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలోకి పరిధిలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

\- భువనగిరి టౌన్



- సీఎం ఆదేశాలతో కార్యాచరణపై అధికారుల అధ్యయనం
- జిల్లాలో 40శాతంపైగా హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ పరిధిలోకి
- మారనున్న ప్రజా ప్రతినిధుల భవితవ్యం



గ్రేటర్ సిటీ.. దిశగా

ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాలిస్తే వచ్చే 2025 నాటికి జిల్లాలో సుమారు 40శాతం గ్రేటర్ పరిధిలోకి వెళ్లనుంది. హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌పై జరుగుతున్న ప్రచారం చర్చనీయాంశమైంది. హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని పురపాలక శాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు హెచ్ఎండీఏ పరిధిలోని కార్పొరేష న్లు,మునిసిపాలిటీలను విలీనం చేసే సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించనున్నారు. న్యాయపరమైన సమస్యల ను అధిగమించేందుకు ప్రస్తుత మునిసిపల్ కౌన్సిల్ కాలపరిమితి ముగిశాక హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు, మునిసిపాలిటీల విలీనం పూర్తవుతుంది. ప్రస్తుత మునిసిపల్ కౌన్సిల్‌ల గడువు డిసెంబరు 2024 నాటికి ము గియనుంది. ఈ మేరకు జిల్లాలోని భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్ మునిసిపాలిటీలు హైదరాబాద్ గ్రేటర్ సిటీ కా ర్పొరేషన్‌లో విలీనం అవుతాయి. దీంతో మునిసిపాలిటీలు తెరమరుగవుతాయి. ప్రస్తుత గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌ను హెచ్ఎండీఏ పరిధి అంతటికీ విస్తరిస్తూ దేశ రాజధాని ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఏకైక హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా కొనసాగించాలా లేక తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ హైదరాబాద్‌గా నాలుగు కార్పొరేషన్‌గా విభజించే అంశంపైనా మునిసిపల్ అధికారుల బృందం అధ్యయనం చేయనుంది. ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండనున్నప్పటికీ జిల్లాలోని 3 మునిసిపాలిటీలు మాత్రం చరిత్రకే పరిమితం అయ్యే అవకాశాలు ఉండనున్నాయి.

ఏం జరుగుతుందంటే...

ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో భువనగిరి, చౌటుప్పల్, బీబీనగర్, పోచంపల్లి, బొమ్మలరామారం మండలాలు ఉన్నాయి. రీజనల్ రింగ్ రోడ్ పరిధిలోకి రానున్న ప్రాంతాలన్నింటినీ హెచ్ఎండీఏలోకి చేర్చాలని ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం కొత్తగా తుర్కపల్లి, యాదగిరిగుట్ట, వలిగొండ మండలాలు హెచ్ఎండీఏ జాబితాలో చేరనున్నాయి. దీంతో జిల్లాలోని 15 మండలాల్లో 8 హెచ్ఎండీఏ పరిధిలోకి వెళ్తాయి. అయితే ప్రభుత్వం సంకల్పిస్తున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌లో ప్రాథమికంగా భువనగిరి, చౌటుప్పల్, పోచంపల్లి మునిసిపాలిటీలను విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నప్పటికీ భౌగోళికంగా ప్రస్తుత జీహెచ్ఎంసీతో ఆ 3 మునిసిపాలిటీలకు ఎలాంటి అనుసంధానం లేకపోగా జిల్లా పరిధిలో కూడా ఆ 3 పట్టణాల మధ్య కూడా కిలోమీటర్ల కొద్ది దూరం ఉంది. దీంతో కేవలం 3 పట్టణాలను మాత్రమే గ్రేటర్ సిటీ పరిధిలో చేరిస్తే పాలనలోనూ, పౌర సేవలు అందించడంలోనూ నూతన ఇబ్బందులు ఎదురుకానున్నాయి. మరోవాదన ప్రకారం పట్టణా లు, గ్రామాలతో నిమిత్తం లేకుండా హెచ్ఎండీఏ పరిధినంతటినీ నూతనంగా ఏర్పాటు చేసే హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ లోనే విలీనం చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.దీంతో జిల్లాలోని 8 మండలాలు, 3 మునిసిపాలిటీలు గ్రేటర్ సిటీ పరిధిలోకి వెళ్లే గ్రామాలు గ్రేటర్‌లో భాగం కానున్నాయి.

ఆదాయం పెంపు.. మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరులలో ప్రధానమైనది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగితేనే రిజిస్ట్రేషన్ల రూపకంలో ప్రభుత్వానికి భారీ ఆదాయం లభిస్తుంది. కానీ పలు కారణాలతో ఇటీవల హైదరాబాద్ నగరం పరిసరాలతో పాటు రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించే లక్ష్యంతో హైదరాబాద్ నగర పరిధిని విస్తరించేందుకు రూపొందిస్తున్న ప్రణాళికలో భాగంగానే హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు లేదా ప్రతిపాదనలు కారణమని ప్రచారం అవుతోంది. అయితే గ్రేటర్ సిటీ కార్పొర్పొరేషన్ ఏర్పాటుతో ఆయా ప్రాంతాల అభివృద్ధి, ఆదాయం పెంపు, మౌలిక వసతుల కల్పన సులువవుతుందని అధికారులు అంటున్నారు. కేంద్రం కూడా గ్రేటర్ సిటీలు, కార్పొరేషన్లకు భారీగా నిధులను, ప్రాజెక్ట్‌లను మంజూరీ చేసేలా నిబంధనలు ఉన్నాయని ఫలితంగా గ్రామాల్లో కూడా పట్టణీకరణ పెరిగి సత్వర అభివృద్ధి సాధ్యమవుతుందని కూడా అధికారులు అంటున్నారు.

మారనున్న 'నేతలరాతలు'

ప్రభుత్వ నిర్ణయం మేరకు సిటీ కార్పొరేషన్ ఏర్పాటైతే కౌన్సిలర్లు, చైర్మన్లు, సర్పంచ్‌లు కనుమరుగవుతారు. వారి స్థానంలో కార్పొరేటర్లు, మేయర్లు పాలనలోకి వస్తారు. ప్రస్తుతం సుమారు 1200 ఓటర్లతో ఒక మునిసిపల్ వార్డు, 300 ఓటర్లతో గ్రామ పంచాయతీ వార్డులు ఉండగా కార్పొరేషన్ ఏర్పాటైతే ఒక్కో డివిజన్ పరిధిలో సుమారు 30వేల నుంచి 40వేల ఓట్లు ఉంటాయి. దీంతో గ్రేటర్ సిటీ పరిధిలోకి కేవలం జిల్లాలోని 3 మునిసిపాలిటీలనే విలీనం చేస్తే ప్రస్తుత 68మంది కౌన్సిలర్లకు బదులు కేవలం 6మంది వరకు కార్పొరేటర్లు ఉండే అవకాశాలు ఉంటాయి. గ్రామీణ ప్రాంతాలను కూడా విలీనం చేస్తే 8 మండలాల్లోని సుమారు 220మంది సర్పంచ్‌ల బదులు కేవలం 10మంది లోపు మొత్తంగా జిల్లా నుంచి 16నుంచి 20మంది వరకు కార్పొరేటర్లు ఉండే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఏడాది అనంతరమే హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌పై స్పష్టత రానుంది.

వివాదాలకు అవకాశం ఇవ్వొద్దు

రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి



సిబ్బందితో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి

భువనగిరి టౌన్, మార్చి 2: వివాదాలకు అవకాశం ఇవ్వకుండా విధులు నిర్వహించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి సూచించారు. భువనగిరి టౌన్, రూరల్, జిల్లా మహిళా పోలీస్ స్టేషన్లను ఆయన శనివా రం తనిఖీచేసి మాట్లాడారు. కేసుల వివరాలు, అధికారులు, సిబ్బంది పనితీరును, పోలీస్‌స్టేషన్ల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై ఆరాతీసి త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమగ్ర వివరాలతో కోర్టుల్లో చార్జిషీట్ వేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో కలిసి పని చేయాలన్నారు. త్వరలో రంజాన్ మాసం ప్రారంభం, పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, సీఐలు కే. సురేష్‌కుమార్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భువనగిరి అర్బన్, మార్చి 2: జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 30కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్షల్లో 5,820మంది విద్యార్థులకు 5,657మంది హాజరు కాగా 163మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12గంటల వరకు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగాయి. పరీక్ష హాల్‌లోకి విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. నిమిషం నిబంధనను సడలించి ఐదు నిమిషాలు పొడిగించినందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ హనుమంతు కే జెండగే తనిఖీ చేశారు. పట్టణంలోని టైమ్స్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లోక్‌సభ ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

కలెక్టర్ హనుమంతు కె. జెండగే



కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి అర్బన్, మార్చి 2: లోక్‌సభ ఎన్నికల విధులు, బాధ్యతలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే సూచించారు. వివిధ విభాగాల నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని భువనగిరి, ఆలేరు, ఇబ్రహీంపట్నం, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వివిధ స్థాయిలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందిని నియమించి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి వారిని తరలించే వాహనాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించకుండా ఎన్నికల కోడ్ టీంలు పర్యవేక్షించాలని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన 24, 48, 72గంటల్లో చేపట్టాల్సిన విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 'సీ' విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాప్ పట్ల కూడా అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 'సువిధ' యాప్ ద్వారా రాజకీయ సభలు, ర్యాలీలు, వివిధ శాఖలు ఇవ్వాల్సిన అనుమతులు నిబంధనల ప్రకారం సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జప్తు చేసిన నగదు, వస్తువులను స్క్వాడ్ టీంలు, పోలీసు అధికారులు సమన్వయంతో సీజర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నియోజకవర్గాలకు సంబంధించి ఎంసీసీ టీంలు సమన్వయం చేసుకొని ఐడీ కార్డులు, డ్రెస్ కోడ్ కలిగిఉండాలన్నారు. కావల్సిన రిజిస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు సమాచార స్లిప్పులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ అందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు పలు రకాల వసతులతో పాటు వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల మొదటి దశ తనిఖీ, మేనేజ్‌మెంట్ పూర్తి అయిందని, నోడల్ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావు, అడిషనల్ డీసీపీ, లా అండ్ ఆర్డర్ నోడల్ అధికారి సి.హెచ్. లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ ఆర్డీవో వి. శేఖర్‌రెడ్డి, విద్యాధికారి, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి కే. నారాయణరెడ్డి, అడిషనల్ డీఆర్డీవో, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి జి. సురేష్, ముఖ్య ప్రణాళిక అధికారి కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ నోడల్ అధికారి జి. వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి డి. విష్ణువర్ధన్‌రెడ్డి, పౌరసంబంధాల అధికారి, మీడియా నోడల్ అధికారి పి. వెంకటేశ్వరరావు, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి, కమ్యూనికేషన్ ప్లాన్‌మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి ఎం. జయపాల్‌రెడ్డి, డీపీవో, కంప్లయింట్ రిడ్రెసల్, ఓటరు హెల్ప్ లైన్ నోడల్ అధికారి ఆర్. సునంద, మహిళా, శిశు సంక్షేమ అధికారి, పీడబ్ల్యూడీ ఓటర్ల నోడల్ అధికారి కే. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆదర్శప్రాయుడు

ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు ఆదర్శప్రాయుడని కలెక్టర్ హనుమంతు కే. జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం శ్రీపాదరావు జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పీకర్‌గా ఉమ్మడిరాష్ట్రానికి ఎంతో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, మహిళ, శిశుసంక్షేమ అధికారి కృష్ణవేణీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు నాగేశ్వరచారి, పార్థసారథిరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



గుట్టలో కేంద్రాన్ని ప్రారంభించిన గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 2: ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు ఆరుట్ల కమలాదేవిరాంచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలో సుమారు 200 గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటుచేసి మూడు వేల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ సాయి క్రీడలు, క్రీడాకారులకు క్రికెట్‌కిట్లు, వస్తు సామాగ్రి ఉచితంగా అందచేశారు. ఆరుట్ల దంపతుల కుటుంబ సభ్యులైన కోడలు ఆరుట్ల సుశీలదేవి, మనుమడు శ్రీకాంత్‌రెడ్డి, మమత ఫౌండేషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, నాయకులు కళ్లెపల్లి మహేందర్, చెక్క వెంకటేశం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, వల్లపు నరేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

- ప్రముఖ యోగా గురు స్వామి రాందేవ్‌బాబా
- నల్లగొండ జిల్లాకేంద్రంలో దయానంద సరస్వతి ద్విశత జయంతి వేడుకలు



దయానంద సరస్వతి ద్విశత జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాందేవ్‌బాబా

నల్లగొండ కల్చరల్, మార్చి 2: వైదిక సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రముఖ యోగా గురు స్వామి రాందేవ్‌బాబా పిలుపునిచ్చా రు. శనివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్య సమాజ మందిరంలో మహర్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి మహాసభ లు, నల్లగొండ ఆర్య సమాజం వందేళ్ల సం బురాల సందర్భంగా ఏర్పాటు చేసిన బృహ ద్ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సృష్టి పుట్టినప్పటి నుం చే వైదిక సనాతన ధర్మం పుట్టిందని, ఆ ధర్మం కొందరి కారణంగా నిర్లక్ష్యానికి గురికాగా, దయానంద సరస్వతి బోధనలు సనాతన ధర్మాన్ని పరిరక్షించాయన్నారు. అజ్ఞాన అంధకారాన్ని నశింపజేయడానికి దయానంద సరస్వతి సత్యార్థ ప్రకాశ్ గ్రంథ పఠనమే వైదిక గురుకులాల శ్రేయస్సుకు ఉపయోగపడుతుందన్నారు. వందేళ్ల లో ఆర్యసమాజం అనేక సామాజికసేవా కార్యక్రమాలు చేప ట్టి అగ్రగామిగా నిలిచిందన్నారు. భయం, భక్తి వల్లనో, ఇతర సౌకర్యాల వల్లనో సనాతన ధర్మాన్ని కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇతర మతాల గ్రంథాలకంటే సనాతన ధర్మ గ్రంథం చాలా విశిష్టమైందన్నారు. హిందువులను ఎన్నో విధాలుగా ప్రలోభాలకు గురిచేసి ఇతర మతాల్లో చేర్చుకుంటున్నారన్నారు. భారతీయ గ్రంథాలైన వేదాలు, భారతీయ చరిత్రను కొందరు వక్రీకరించి తమ సంస్కృతి గొప్పదని చెప్పుకుంటున్నారన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు యోగ, ప్రాణాయా మం, యజ్ఞం వంటి వాటిని చేపట్టాలన్నారు. తాను పేద కుటుంబంలో పుట్టి కఠోరశ్రమ, దయానందుడి సత్యార్థ ప్రకాశ్ పఠనంతో స్ఫూర్తి పొంది, ఈస్థాయికి ఎదిగానని గుర్తుచేశారు. వేదాలు, ఉపనిషత్తులు సనాతన ధర్మం, భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలన్నారు. వైదిక సాహిత్య సంపద దేశానికి ఎంతో వైభవాన్ని తెచ్చిందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణ గ్రంథాలు, ధర్మశాస్త్రాలు భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దమన్నారు. ఢిల్లీ సర్వదేశిక ఆర్య సమాజ ప్రతినిధి అధ్యక్షుడు స్వామి ఆర్యవేశ్ మాట్లాడుతూ నిజాంపాలనకు వ్యతిరేకంగా ఆర్యసమాజం పోరాటం చేసిందని, ఈ పోరాటంలో 80శాతం మంది ఆర్యసమాజ సభ్యులే ఉన్నారన్నారు. వందేళ్ల ఆర్యసమాజం జాతి పరిరక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. తొలుత ఆర్యసమాజ మందిరం నుంచి రామగిరి మీదుగా క్లాక్‌టవర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో వైదిక గురుకులాల సంచాలకుడు స్వామి ప్రణమానంద సరస్వతి, ఆర్యసమాజ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు, పతంజలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి హరికిషన్, మాజీ డీఎస్పీ నళిని, ఆర్యసమాజమందిరం జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిద్రమత్తులో అదుపు తప్పిన కారు

» ఇద్దరు యువకులు మృతి » దైవదర్శనాలకు వెళ్తుండగా విషాదం



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో అతివేగంతో ఫుట్‌పాత్‌పైకి వచ్చి దెబ్బతిన్నకారు (ఇన్‌సెట్లో) కారు ప్రమాదంలో మృతులు విక్రమ్, రమేష్

తిరుమలగిరి, మార్చి 2 : డ్రైవర్ నిద్రమత్తులో కారు అదుపు తప్పి ఇంటి గోడను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కాశిరెడ్డిపల్లెకు చెందిన కోల విక్రం, కుంట రమేష్, డోర్నాల శ్రీకాంత్, కుందేళ్ల అర్జున్ నలుగురు కలిసి కారులో విజయవాడ, తిరుపతి క్షేత్ర దర్శనాలకు బయలుదేరారు. కారును డోర్నాల శ్రీకాంత్ నడుపుతుండగా శనివారం ఉదయం మూడు గంటల సమయంలో తిరుమలగిరి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలోకి రాగానే నిద్రమత్తులో అదుపు తప్పింది. వేగంగా రోడ్డు పక్క ఫుట్‌పాత్‌పైకి వెళ్లి సమీపంలోని ఇంటి గోడను ఢీకొట్టింది. ఒక్కసారిగా భారీ శబ్ధం రావడంతో మేలుకున్న ఇంట్లోనివారు బయటకు వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను క్షతగాత్రులను సూర్యాపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పక్కసీటులో కూర్చున్న కోట విక్రమ్(30), వెనుకసీటులో కూర్చున కుంట రమేష్(31) మృతి చెందారు. కారు నడుపుతున్న డోర్నాల శ్రీకాంత్, కుందేళ్ల అర్జున్‌కు తీవ్రగాయాలతో కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రమేష్‌కు భార్య, కుమారుడు ఉండగాఆ, మిగిలిన ముగ్గురు అవివాహితులు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. రమేష్ సోదరుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వెండిజోడు సేవోత్సవం

● నిత్య ఆదాయం రూ.32.87 లక్షలు ● 5న హుండీ కానుకల లెక్కింపు


వెండి జోడు సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి వెండి జోడు సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళలో అలంకార వెండి జోడు సేవలు, దర్బారు సేవోత్సవం, సహస్ర నామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, యాగశాలలో రుద్ర హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. లక్ష్మీనృసింహుడిని 25వేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.32,87,732 ఆదాయం సమకూరింది. నృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించే కానుకలను ఈ నెల 5వ తేదీన లెక్కించనున్నట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు శనివారం ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. క్షేత్రాన్ని సందర్శించిన భక్తులు ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కు పూజల్లో పాల్గొన్నారు. దీంతో సేవా మండపాలు, తిరువీధులు, ఘాట్ రోడ్ ప్రాంతాలు సందడిగా మారాయి. స్వామివారి ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాలకు అరగంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు.


వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి, మార్చి 2: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణాన్ని శనివారం వేదపండితులు కన్నుల పండువగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం నిత్య కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహామూర్తి, లక్ష్మీనరసింహామూర్తి,సీతరామశాస్త్రి, శేషగిరిరావు, రాజష్, రమేష్ పాల్గొన్నారు.

ముదిమాణిక్యం చారిత్రక వైభవం




నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం గ్రామం చారిత్రక సంపదకు నెలవుగా మారింది. క్రీస్తుశకం 1635వ కాలంలోనే కృష్ణానదీ తీరంలో ఉన్న ముదిమాణిక్యం గ్రామం పట్టణంగా విలసిల్లింది. శతాబ్దాల క్రితమే వర్తక, వాణిజ్యాలకు కేంద్రంగా ముదిమాణిక్యం విరాజిల్లిందని పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు.
- అడవిదేవులపల్లి


బాదామి చాళుక్యుల కాలంనాటి దేవాలయాలు




పంచకూట ఆలయం

బాదామి చాళుక్యుల నాటి ఆలయం


ధ్వంసమైన వీరుడి విగ్రహం

- కృష్ణానదీ తీరంలో బాదామి చాళుక్యుల నాటి ఆలయాలు
- ఓడరేవుతో వర్తక, వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి
- పర్యవేక్షణలేక కనుమరుగువుతున్న చారిత్రక గుర్తులు
- కట్టడాలను పరిరక్షించాలని కోరుతున్న గ్రామస్థులు

గ్రామంలో సుమారు 1,300 ఏళ్ల నాటి పురాతన ఆలయాలను చరిత్రకారులు, పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. ఈ ఆలయాలు బాదామి చాళుక్యుల కాలానికి చెందినవని పబ్లిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ, హెరిటేజ్(ప్రిహా), తెలుగు వర్సిటీకి చెందిన డాక్టర్ ఎం.ఏ. శ్రీనివాసన్, ఎస్. అశోక్‌కుమార్‌ల బృందం పేర్కొంది. ఆలయాల్లో శివలింగం, విష్ణు విగ్రహ శిథిలాలతోపాటు ఒక శాసనాన్ని గుర్తించారు. శాసనంలో 'గండలోణ్రు' అనే పదం ఉందని బహుశా అది 8వ శతాబ్దానికి చెందినది కావొచ్చని పురాతత్వ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కృష్ణానది ఒడ్డున ఉన్న రెండు ఆలయాలను క్రీస్తు శకం 543 నుంచి 750 మధ్య కాలంలో నిర్మించి ఉంటారని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఏ. శ్రీనివాసన్ తెలిపారు. ఆలయాలు కాదంబ నగార శైలిని, రేఖాన గార శైలి పద్ధతిలో నిర్మించినట్లు గుర్తించారు. ఇదే గ్రామం లో ఉన్న ఐదు దేవాలయాల్లో (పంచకూట) ఒక ఆలయంలోని స్తంభంపై 'గండలోణ్రు' అని లఘు శాసనంపై రాసిఉంది. ఈ స్తంభాన్ని 8 లేదా 9వ శతాబ్దంలో నిర్మించారు. ఈ లఘు శాసనాన్ని ఒక వీరుడి బిరుదుగా భావిస్తున్నట్లు ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎపిగ్రఫీ శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నం వివరించారని స్థానికులు తెలిపారు. అదేవిధంగా ముదిమాణిక్యం గ్రామం నడిబొడ్డున ఉన్న రామాల యం వద్ద 350ఏళ్ల నాటి ఒక స్తంభాన్ని కనుగొన్నట్లు చరిత్రకారులు ప్రిహా తెలిపారు. కృష్ణానదీతీరంలో పురాతన సోమేశ్వరాలయం వద్ద 20 అడుగుల మేర ఉన్న ధ్వజ స్తంభమే అలనాటి దీప స్తంభంగా గుర్తించారు. దీప స్తంభం శకనామ సంవత్సరం ప్రకారం 1,557 సంవత్సరంలో నిర్మించినట్లు దానిపై రాసి ఉండగా క్రీ.శ ప్రకారం 1635 జూన్ 1న సోమవారం అని ఆ స్తంభంపై మాదిరాజు నర్సయ్య శాసనాన్ని లిఖించినట్లు పబ్లిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాల జీ, హెరిటేజ్(ప్రిహా) నిర్ధారించారు. శాసనంపై తెలుగు తమిళ పదాలు ఉన్నట్లు కాశీవిశ్వనాథుని ప్రార్థిస్తున్నట్లు పద్యం కూడా రాసినట్లు తెలిపారు. ఈ శాసనాన్ని ఆనాడు ముదిమాణిక్యాన్ని పాలించిన వాలి మునులయ్య కుమారుడు పొలినేడు వేయించినట్లుగా గుర్తించారు. దీప స్తంభమే నాటి ప్రజలకు దిక్సూచిగా ఉండేదని భావిస్తున్నారు.

మునిమాణిక్యమే... నేటి ముదిమాణిక్యం

క్రీ.శ సుమారు 1,213 సంవత్సరంలో కల్యాణ చాణక్య వంశానికి చెందిన త్రిభునమల్లదేవుడు, అతని సామంతరాజైన తొండేశ్వరుడు 50 స్తంభాలతో కూడిన సత్రశాల బౌద్ధమ దేవాలయాలు నిర్మించారు. అయితే అక్కడ కొన్నాళ్లకు ఆ దేవాలయాల వద్ద కృష్ణానది పరివాహక ప్రాంతంలో 'బౌద్ధంపాడు' అనే గ్రామం వెలిసింది. గ్రామస్థులు నిత్యం ఆ దేవాలయంలో పూజలు, పండుగలు చేసేవారు. అప్పట్లో ఆ గ్రామానికి గత్తర వచ్చి గ్రామం కనుమరుగై పోయింది. ఆగ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అడవి ఉంది. ఆ అడవి సమస్త దేవుళ్ల నిలయంగా ఉండేది. అక్కడికి దేవుళ్లు వచ్చి వెళ్తుంటారని భక్తుల నమ్మకం. ఆ అడవిలో బౌద్ధంపాడు ప్రజలు కొందరు నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. ఆ అడవిలోనే కొందరు మునులు నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మునులు, ప్రజలు నివాసముంటున్న ప్రాంతాన్ని మునిమాణిక్యంగా పిలిచేవారు కాలక్రమేణా మునిమాణిక్యం అనే పేరు ముదిమాణిక్యంగా మారిందని చరిత్రకారులు చెబుతున్నారు.

కనుమరుగవుతున్న చారిత్రక సంపద

క్రీస్తుశకం 13వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వర కు కల్యాణ చాళుక్యులు, బాదామి చాళుక్యులు ముదిమాణిక్యం గ్రామాన్ని పాలించారు. ఆ కాలంలోనే పట్టణంగా విరాజిల్లింది. కృష్ణానది తీరంతోపాటు గ్రామ నడిబొడ్డున ఎన్నో పురాతన ఆలయా లు, కోటలు, దీపపు స్తంభాలు, పురాతన ఓడరేవు, శాసనాలు నెలవుగా మారింది. కొందరు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతూ ఆలయాలను, ఆనవాళ్లను ధ్వంసం చేస్తున్నారు.

పడవలు, ఓడలకు దిక్సూచిలా దీపస్తంభం



500 ఏళ్ల క్రితం కృష్ణానది తీరంలో ఉన్న దీప స్తంభంపై దీపాలు వెలిగించేవారు. ఆ దీపం దిక్సూచిగా ఉపయోగపడి గ్రామానికి పడవలు, ఓడ లు రాకపోకలు సాగించేవి. గ్రామానికి నాలుగు దిక్కుల్లో స్తంభాలపై నాలుగు శాసనాలు అప్పట్లో వేయించారు. ముదిమాణిక్యం గ్రామం ఎంతో ప్రసిద్ధి చెం దగా ఇప్పుడు నాటి ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని ముదిమాణిక్యం గ్రా మంలోని గుడి, కోటలను, దీప స్తంభాలను పరిరక్షించాలి.
- చల్లా శివారెడ్డి ముదిమాణిక్యం

పర్యవేక్షణ అంతంతే

- కీలక శాఖలకు ఏళ్ల తరబడి ఇన్‌చార్జిలే దిక్కు
- ఇంకెన్నాళ్లీ ఇన్‌చార్జిల పాలన?
- విద్యా, గిరిజన, మైనార్టీ శాఖలకు అదే పరిస్థితి



యాదాద్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా రూపొందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఇందుకోసం ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాల్సి ఉంటుంది. జిల్లా యంత్రాంగం లో విద్యాశాఖ ఎంతో ప్రాముఖ్యమైంది. కీలకమైన శాఖకు గత రెండున్నరేళ్లకు పైగా ఇన్‌చార్జి అధికారితోనే కాలం వెళ్లదీస్తున్నారు. నూతన ప్రభు త్వం ఏర్పడగానే పలువురు అధికారుల బదిలీ ప్రక్రియను చేపట్టింది. ఇన్‌చార్జి అధికారులకు అవకాశం లేకుండా పూర్తిస్థాయి బాధ్యతలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ ఇన్‌చార్జి అధికారుల స్థానంలో పూర్తిస్థాయి అధికారులు నియమిస్తారని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. పదోతరగతి పరీక్షలు ఈ నెలలో ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలపై జిల్లాయంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గతంలో కంటే ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకోసం పదో తరగతి విద్యార్థుల కు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తుంది. అయితే జిల్లాలో పూర్తిస్థాయి విద్యాశాఖ అధికారి లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. యాదాద్రి భువనగిరి డీఈవోగా పనిచేసిన చైతన్య జైనీ 2021 అక్టోబర్‌లో బదిలీపై వెళ్లడంతో విద్యాశాఖ నల్లగొండ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహకు అదనపు బాధ్యతలను అప్పగించింది. 2021 అక్టోబరు నుంచి 2022 జూన్ వరకు నరసింహ డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో వరంగల్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కె.నారాయణరెడ్డికి జూలై నుంచి అదనపు బాధ్యతలను అప్పగించారు. కీలకమైన విద్యాశాఖకు శాశ్వత డీఈవోను నియమించిన పక్షంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతోపాటు సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం చూపే అవకాశం ఉంటుంది. ఇన్‌చార్జి అధికారి ఉన్న పక్షంలో రెండు శాఖలకు సమన్యాయం చేయాల్సి ఉంటుంది. దీంతో అధికారులు కాస్త ఇబ్బందికరమే. గతంలో డీఈవోతోపాటు... డిప్యూటీ డీఈవోలు ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. అయితే ప్రభుత్వం డిప్యూటీ డీఈవో పోస్టులను రద్దు చేయడంతో, వారి బాధ్యత ఎంఈవోలపై పడింది.

277 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

జిల్లాలో మొత్తం 3,465 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 2,840 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మరో 625 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతంలో విద్యాశాఖ నివేదిక రూపొందించింది. అయితే బదిలీల ప్రక్రియతోపాటు కొంతమంది ఉపాధ్యాయులు జిల్లాకు విచ్చేశారు. తాజాగా ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించింది. ఈ నోటిఫికేషన్‌లో జిల్లాలో మొత్తం 277 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జారీచేసింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 84, లాంగ్వేజ్ పండిట్‌లు 21, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 2, ఎస్‌జీటీలు 137, స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేటర్లు 10, ఎస్‌జీటీ(స్పెషల్ ఎడ్యుకేటర్స్23 వరకు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలపై భారం పడే అవకాశం ఉంది. అయితే ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు... ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులను విద్యాశాఖ సర్దుబాటు చేసింది. జిల్లాలో 50 స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసి, విద్యా ప్రమాణాల బాధ్యతను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. అయితే వారికి అవసరమైన సిబ్బందిని మాత్రం ఏర్పాటు చేయలేదు. సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడింది.

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో మొత్తం 17 మండలాల్లో 712 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 481, ప్రాథమికోన్నత పాఠశాలలు 68, ఉన్నత పాఠశాలలు 163 ఉన్నాయి. 17 మండలాల్లోనూ శాశ్వత ఎంఈవోలు లేకపోవడం గమనార్హం. జిల్లాలో మొత్తం 163 జీహెచ్‌ఎం పోస్టులకు కేవలం 73మందిమాత్రమే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 90పాఠశాలల్లో సీనియర్ స్కూల్‌అసిస్టెంట్లే ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులుగా అదనపు బాధ్యతలు స్వీకరించిన స్కూల్ అసిస్టెంట్లు తరగతిలో ఆశించిన మేరకు పాఠ్యాంశాలు బోధించడంలేదు. పాఠశాలల పర్యవేక్షణతోనే కాలం గడిచిపోతోంది. దీంతో విద్యార్థులు పలుసబ్జెక్టుల్లో వెనుకబడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖలో పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారులతోనే సమస్యలకు పరిష్కారం మార్గం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిన్నరగా గిరిజన, మైనార్టీ శాఖల అధికారుల పోస్టులు ఖాళీ

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. గతంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా పనిచేసిన మంగ్తానాయక్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల కు పట్టుపడ్డారు. ఆయన స్థానంలో జిల్లా యంత్రాంగం డీఆర్డీవోకి అదనపు బాధ్యతలు అప్పగించింది. డీఆర్డీవో శాఖ కీలకమైంది. ఉపాధి కూలీలతోపాటు స్వయం సహాయక సంఘాల గ్రూపుల రుణాల మంజూరుతోపాటు ఇతర పథకాలపై నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతో డీఆర్డీవోపై అదనపు పనిభారం పడిందని చెప్పవచ్చు. ప్రస్తుతం జిల్లాలో పోడు భూములు లబ్ధిదారుల ఎంపికతోపాటు గిరిజన సంక్షేమ హాస్టళ్లపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు హాస్టల్ వార్డెన్లపై నిరంతరం పర్యవేక్షించాలి. ఈ శాఖకు శాశ్వత అధికారిని నియమిస్తే పర్యవేక్షణ సులువుగా ఉంటుందని పలువురు గిరిజన నేతలు కోరుతున్నారు. అదేవిధంగా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బదిలీ అయి ఏడాదిన్నర కాలం కావస్తోంది. ఈ శాఖకు బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య ఇన్‌చార్జిగా ఉన్నారు. పూర్తిస్థాయి మైనార్టీ శాఖ అధికారిని నియమించాలని కోరుతున్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

● టీఎస్‌ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

హుజూర్‌నగర్, మార్చి 2 : పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన టీఎస్ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. మాదిగలంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో హక్కులు సాధించుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తూ పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరైనవిధానం కాదన్నారు. మలమూత్రాలు ఎత్తిపోస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్న దళిత, పారిశుధ్య కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించకుండా వారి ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. పారిశుధ్య కార్మికుల్లో అధిక శాతం దళిత కులస్థులే ఉన్నారన్నారు. ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందన్నారు. స్వచ్ఛభారత్‌కు ప్రతిరూపమైన కార్మికులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా చిలక భిక్షంను నియమించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పరశురాములు, జిల్లా ఇన్‌చార్జి నాగరాజు, రామకృష్ణ, సందీప్, కృష్ణయ్య, ముక్కంటి, సైదులు, ఆరోను హుస్సేను పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో సురేష్

మోటకొండూరు, మార్చి 2: గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని అదనపు డీఆర్‌డీవో సురేష్ ఆదేశించారు. మండల కేంద్రంలో పాటు మండలంలోని కాటేపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలను శనివారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూలీలకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లోనే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, ఎంపీవో కిషన్, ఏపీవో అరుణ, గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ ఉన్నారు.

మోత్కూరులో క్యాంపు రాజకీయం

మోత్కూరు, మార్చి 2: మోత్కూరు మునిసిపాలిటీలో అవిశ్వాసంతో ఖాళీ అయిన మునిసిపల్ చైర్‌పర్సన్ స్థానానికి ఈ నెల 4న ఎన్నిక నిర్వహించనున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సావిత్రిపై 9మంది కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాసంపై గత నెల 9న ఓటింగ్ నిర్వహించగా అవిశ్వాసం నెగ్గి ఆమె చైర్‌పర్సన్ పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 4న నూతన చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ కౌన్సిలర్లకు సమావేశం నోటీసులు అందజేసినట్లు మునిసిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ తెలిపారు. నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలిసి క్యాంపు నిర్వహిస్తున్నారు. మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు 8మంది, కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉండగా గత చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరుగురు, కాంగ్రెస్ కౌన్సిలర్లు నలుగురు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. ఇప్పుడు ఆ పది మంది కౌన్సిలర్లలో 9మంది శనివారం శిబిరానికి వెళ్లగా, వైస్‌చైర్మన్ ఆదివారం శిబిరానికి వెళ్లనున్నట్టు తెలిసింది. 11వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

'ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం'

చౌటుప్పల్ టౌన్, మార్చి 2: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మునిసిపాలిటీ అధ్యక్షుడు సుర్వి సమావేశంలో నాయకులు నర్సింహగౌడ్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, ఉబ్బు వెంకటయ్య, పోలోజు అనిల్‌కుమార్, అంతటి బాలరాజ్, కాసర్ల శ్రీనివాసరెడ్డి, రమేష్‌గౌడ్, బాలగోని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలి

మోత్కూరు, మార్చి 2: కూలీలకు మునిసిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ డిమాండ్‌చేశారు. పట్టణంలో శనివారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. వ్యవసాయ పనులు లేనప్పుడు మునిసిపాలిటీల్లో కూలీలు పనులు దొరక్క కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. రెండు, మూడు గ్రామాలను కలిపి మునిసిపాలిటీలు చేసినంత మాత్రాన కూలీల స్థితిగతులు మారవన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికేడాది బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ ఉపాధి హామీ పథకం ఎత్తేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మెతుకు అంజయ్య పాల్గొన్నారు.

ఏపీజీవీబీ సేవలు వినియోగించుకోవాలి

మోత్కూరు, మార్చి 2: ఏపీజీవీబీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రీజనల్ మేనేజర్ పి. సమత కోరారు. 48 ఏళ్లుగా మోత్కూరులో సేవలు అందిస్తున్న ఏపీజీవీబీ బ్రాంచ్ గతంలో ఆరెగూడెం రోడ్డుకు ఉండగా ఇప్పుడు మోత్కూరు-భువనగిరి రోడ్డులోని నూతన అద్దె భవనంలోకి మార్చారు. నూతన భవనంలోకి మార్చిన బ్యాంకు కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. తమ బ్యాంకు ద్వారా ఆరోగ్యబీమా, ప్రమాదబీమా లాంటి వివిధ రకాల బీమా పాలసీలు అందిస్తున్నామన్నారు. తమ బ్యాంకులో డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ కె.హెచ్ నాయక్, బ్రాంచ్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకుంటే శాంతియుత సమాజం



పూజలు నిర్వహిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి రూరల్, మార్చి 2: ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే శాంతియుత సమాజం నెలకొంటుందని సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిర్డిసాయి ఆశ్రమ రమణేశ్వరంలో 45శివలింగాలను, 35విగ్రహ మూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం నుంచి గురువారం 7వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గణపతి పూజా పుణ్యాహచనం, అఖండ దీపారాధన పంచద్రవ్య ప్రాశసం, యంత్ర పూజలు నిర్వహించారు. భక్తితో భగవంతుడిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మేడిగడ్డను సందర్శించడం హాస్యాస్పదం

రామన్నపేట, మార్చి 2: ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా దుర్వినియోగం చూసి దొంగే దొంగన్నట్లు మేడిగడ్డ బ్యారేజిని బీఆర్ఎస్ నాయకులు సందర్శించడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పూస బాకాషన్ విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి పథకం తప్పుల తడక అని కేంద్ర ప్రభుత్వ జలశక్తిశాఖ వెల్లడించినా పట్టించుకోలేదని ఆరోపించారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

భువనగిరి రూరల్, మార్చి 2: భువనగిరి మండలం వడపర్తి గ్రామస్టేజీ వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు వస్తున్న కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయని 108 సిబ్బంది తెలిపారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన వారు కొమురవెల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

పోచంపల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 2: భూదాన్‌పోచంపల్లికి చారిత్రక నేపథ్యం దృష్ట్యా గ్రామీణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని సమస్యలపై స్థానిక వైద్యాధికారి శ్రీవాణితో మాట్లాడారు. 24గంటల వైద్య సదుపాయం కోసం మరో వైద్యాధికారిని నియమించేందుకు కృషిచేస్తానన్నారు. మరో ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్ అధ్యక్షతన కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామమైన పోచంపల్లిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పెద్ద చెరువును మినీట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టి పర్యాటకులను ఆకట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే చెరువు పక్కన బైపాస్ రోడ్డునే నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పినా వారికి బుద్ధి రాలేదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కమిషనర్ కే వీరారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బోగ భానుమతి విష్ణు, మోటె రజిత రాజు, సామల మల్లారెడ్డి, పెద్దల చక్రపాణి, గుండు మధు, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేష్, పాక మల్లేష్‌యాదవ్, భారత లవకుమార్, సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ సామ మోహన్‌రెడ్డి, గునిగంటి వెంకటేష్‌గౌడ్, కుక్కకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోచంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రతి గడపకు సంక్షేమ పథకం అందించడమే ధ్యేయం

మోత్కూరు: రాష్ట్రంలోని ప్రతి గడపకూ ఏదో ఒక సంక్షేమ పథకం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పాటిమట్ల గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. రూ.20లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉపకేంద్రం భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా గడవక ముందే నాలుగు హామీలు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల విలువైన రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500లకు గ్యాస్‌సిలిండర్, 200యూనిట్లలోపు ఉచిత కరెంటు అమలు చేశామన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు భరోసా అమలు చేస్తామన్నారు. శంకుస్థాపన సందర్భంగా భవన నిర్మాణ కాంట్రాక్టర్ ఎవరని పీఆర్ ఏఈని ప్రశ్నించగా కోదాడకు చెందిన వ్యక్తి అని ఈ రోజు రాలేదని చెప్పారు. అతనితో పనిచేయించే బాధ్యత మీదేనని, ఆయన సకాలంలో పనులు చేయకుంటే నోటీసు ఇచ్చి కాంట్రాక్టు రద్దుచేసి, అందుబాటులో ఉన్న వారితో పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. డీఈఈ, ఈఈ ఎందుకు రాలేదని ప్రశ్నిస్తూ ఇక ముందు ఇలాంటి కార్యక్రమాల్లో అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. అనంతరం పలువురు చెప్పుకున్న సమస్యలను విని సమాధానం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ డి.రాంప్రసాద్, డాక్టర్ హేమంత్‌కుమార్, పీఆర్ఏఈ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పేలపూడి, రాచకొండ బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



మోత్కూరు : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని కోటమర్తి, గట్టుసింగారం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలను ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేస్తుందని వివరించారు. శిలాఫలకాన్ని చూసి ఎమ్మెల్యే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒక ఇంటి గోడపై శిలఫలకాన్ని పెట్టడం ఏమిటని పంచాయతిరాజ్ శాఖ ఏఈ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకుస్థాపన చేయకుండానే వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం యాదమ్మ సత్యనారాయణ, మాజీ సర్పంచులు చిప్పలపల్లి బాలు, నిమ్మనగోటి జోజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య, వేముల బిక్షం, కొప్పుల నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన : మాజీ ఎంపీ బూర

భువనగిరి రూరల్, మార్చి 2: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో పార్లమెంట్ పరిధిలో ఎయిమ్స్ కేంద్రీయ విద్యాలయం, ఎంఎంటీఎస్, జాతీయ రహదారుల విస్తరణ, సీసీఎంబీ, సైనిక పాఠశాల మంజూరుకు కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, నాయకులు నర్ల నర్సింగ్‌రావు, పడమటి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



బూర నర్సయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్‌గా అంజయ్యగౌడ్



అంజయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ టౌన్, మార్చి 2: చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి(బీఆర్ఎస్)ను పలు ఆరోపణలతో తొలగించి, వైస్‌చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్ (కాంగ్రెస్)కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అంజయ్యగౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, తహసీల్దార్ ఎస్. హరికృష్ణ, సహకారశాఖ ఫీల్డ్ ఆఫీసర్ రంజిత్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో రమేష్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బు రాజుగౌడ్, సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ మురళి, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, ఉబ్బు వెంకటయ్య, చింతల వెంకటరెడ్డి, ఎం. రమేష్‌గౌడ్, కొండూరు వెంకన్న, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, గోశిక రవి, బాల్‌రాజ్ పాల్గొన్నారు. అప్పటి చైర్మన్ దామోదర్‌రెడ్డిపై వైస్‌చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్ 2024 జనవరి 8న డీసీవో ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సహకార శాఖ ప్రత్యేక అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలోని బృందం సమగ్ర విచారణ జరిపింది. రూ.65లక్షలతో చేపట్టిన గోదాం నిర్మాణంతో పాటు కార్యాలయ సిబ్బంది నియామకాల్లో నిబంధనలు పాటించలేదని తేల్చారు.

నేటినుంచి భ్రమరాంబ మల్లిఖార్జున ఆలయ బ్రహ్మోత్సవాలు

తుర్కపల్లి, మార్చి 2: మండలంలోని ముల్కలపల్లి గ్రామ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయ బహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 3వ తేదీ ఆదివారం తెల్లవారుజాము నుంచి 5వరకు వైభవంగా నిర్వహిస్తారు. స్వయంగా వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయంలో సుమారు 500 సంవత్సరాల పూర్వం నుంచే ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగనాన్ని పచ్చటి ఆకులతో పందిళ్లు వేసి మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని ఆలయాన్ని అలంకరించారు. ఆదివారం ఉదయం ఆలయంలో గణపతి పూజతో ప్రాంభించి పుణ్యహవాచనం, గంగపూజ, రాత్రి గంటల 8:15నిమిషాలకు బియ్యం సుంకు, భద్రకాళి పూజ నిర్వహిస్తారు. రాత్రి గంటలకు. 10:00లకు ఒగ్గు కథ నిర్వహిస్తారు. 4న సోమవారం ఉదయం దిష్టికుంభం పోయుట, ఆలయ ప్రాంగణంలో శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవాన్ని సాంప్రదాయ బద్ధంగా ఒగ్గు కళాకారులు నిర్వహిస్తారు. సుర్యుని ఎదుర్కోలు, అగ్ని గుండాలు తొక్కుట, పుట్ట బంగారం తెచ్చుట వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

16వ తేదీకి లోక్ అదాలత్ మార్పు

చౌటుప్పల్ టౌన్, మార్చి 2: చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 9వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి స్టేట్ లీగల్ సెల్ అథారిటీ మార్చిందని జడ్జి మహతీ వైష్ణవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్వర కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు మంచి అవకాశమని, కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని కేసుల నుంచి విముక్తి పొందాలని జడ్జి కోరారు. రాజీ మార్గంలోనే కేసులకు పరిష్కారం లభిస్తుందని, పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని కోరారు.

విదేశీ విద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, మార్చి 2: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ విదేశీ విద్య పథకంలో విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యనభ్యసించేందుకు అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.యాదయ్య కోరారు. మోత్కూరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు వెళ్లే విద్యార్థుల వయస్సు ఈ ఏడాది జూలై 1 నాటికి 35ఏళ్లు ఉండాలని, వారి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.5లక్షల లోపు ఉండాలని, డిగ్రీలో 60 శాతం మార్కులు పొంది ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆయన తెలిపారు.

వసతి గృహం ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

మోత్కూరు, మార్చి 2: మోత్కూరులో కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సాంఘీక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డి. ఉమాదేవికి శనివారం వినతిపత్రం అందజేశారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలకు కేంద్రంగా ఉన్న మోత్కూరులో కళాశాల హాస్టల్ లేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఆయా మండలాల గ్రామాల నుంచి మోత్కూరు రావడానికి తగిన బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. సుమారు 400మంది విద్యార్థులు ఆయా మండలాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చి మోత్కూరులో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్‌మూర్తి, తాళ్ల నాగరాజు, జిల్లా కార్యదర్శి వనం రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

భువనగిరి రూరల్, మార్చి 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ డి. శ్రీపాదరావు జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అను రాధా దేవి, ఏపీవో బాలస్వామి, కంచి మల్లయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మాజీ స్పీకర్ డి.శ్రీపాదరావు జయంతి సందర్భంగా మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంతోపాటు మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ తహసీల్దార్ వి.రవికుమార్ ,డిటీ సఫియోద్దీన్, ఆర్ఐ మల్లికార్జునరావు, ఎంపివో పి.పద్మావతీ, ఏపివో బి.రమేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ప్రదీప్‌కుమార్, బగ్గు, శ్రీశైలం, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్బంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, తహశీల్దారు కార్యాలయాల్లో అమనగంటీ శేషగిరిరావు దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అడ్డగూడూరులో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామన్నపేట: మండల ప్రజాపరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉన్న లక్ష్మి జగన్ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, బలరాం, తాసిల్దార్ సి లాల్ బహదూర్, ఎంపీడీవో యాకూబ్‌నాయక్, పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చింతల కిష్టయ్య, దొడ్డికాడి బగత్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కూలీలతో మాట్లాడతున్న నర్సింహ

భువనగిరి రూరల్, మార్చి 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీ పని చేస్తున్న కూలీలకు పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమ డుగు నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ముస్త్యాల పల్లిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. 10 వారాలు గడిచినా ఎంత కూలీ వస్తుందో తెలియక కూలీలు అయోమయానికి గురవుతున్నారన్నారు. కూలీలకు పేస్లిప్పులు ఇచ్చి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. లక్ష్మీనర్సయ్య, కూలీలు, లావణ్య, గౌతమి, మానస, రాములమ్మ, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

గుండాల, మార్చి 2: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ తాండ్ర అమరావతి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జలకుమారి, ఎంపీడీవో దేవిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ABC సమాచారం

భువనగిరి టౌన్: జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములను ప్రభుత్వం పరిరక్షించాలని ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరసన దీక్ష చేపట్టనున్నట్లు వక్ఫ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ. జహంగీర్ తెలిపారు. శనివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విలువైన వక్ఫ్ భూములను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఎంఏ ఇక్బాల్, షేక్ హమీద్ పాషా, ఎస్‌కే లతీఫ్, ఇక్బాల్ చౌదరి, ముక్తార్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ జన్మదిన వేడుకలు స్థానిక భువనగిరి ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. నర్సయ్యగౌడ్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కట్కూరి బిక్షపతి, కోమ్ము యాదయ్య, ఏలూరి రవి, కూనూరు సుధాకర్, కడగంచి జంగయ్య, గుండాల అంజయ్య, గుంటోజు కృష్ణమాచారి, సుర్వి హరిబాబు, శుభకోటి శశికృష్ణమాచారి పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గడ్డం స్వామి మృతిచెందడం బాధాకరమని డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. నిర్వహించిన స్వామి సంతాప సభలో స్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు రాష్ట్ర నాయకులు ఎస్కే చాంద్, నోముల శంకర్, సురేష్, ప్రదీప్, బత్తుల వెంకన్నగౌడ్, అనంతచారి పాల్గొన్నారు.

రామన్నపేట: 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలుపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు గంగుల రాజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తుందన్నారు. నాలుగు గ్యారెంటీలు అమలు అమలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ. జమీరొద్దీన్, జెల్ల వెంకటేష్, రామిని రమేష్, ఆకవరపు మధుబాబు, కూనూరు కృష్ణ, సాల్వేరు ప్రవీణ్, గర్దాసు సురేష్, పెద్దగోని వెంకటేష్, భూపతి నర్సింహా, గోలుసుల ప్రసాద్, ఆముద లక్ష్మణ్, రాపాని ఉపేందర్, బట్టే సంతోష్, సత్తయ్య పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామిని ఆర్టీసీ ఆర్ఎంలు మాధవి, శివకుమార్, నల్లగొండ, యాదాద్రి డిపో మేనేజర్లు శ్రీదేవి, శ్రీనివాస్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో మోహన్‌బాబు, అర్చకులు, యాదగిరి, స్వామి, సిబ్బంది పాండు, రామనర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని దుప్పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలకు నక్క ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ రూ.లక్ష విలువ గల ఫర్నిచర్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రిటైర్డ్ ఎంఈవో వెంకటయ్య, ఎంపీటీసీ అండాలునర్సయ్య ఉన్నారు.

మోత్కూరు: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి. మనోహర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంటు ఎస్.రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంటు రచ్చ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు: మండలంలోని ముశిపట్ల గ్రామంలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవస్థాన కమిటీ ప్రతినిధులు కోరారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో పైళ్ల నర్సిరెడ్డి, మేరుగు యాదగిరి, శేఖర్, నర్సయ్య, సోలిపురం చెన్నారెడ్డి, బుషిపాక హన్మయ్య, కిష్టయ్య, కేమిడి రాములు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో యాకూబ్‌నాయక్ పరిశీలించారు. రికార్డులు, కూలీల హాజరు పట్టికను, పని కొలతలను పరిశీలించారు. వేసవి కాలంలో ఉపాధి హామి కూలీల ఎక్కువ శాతం హాజరై పనులు నాణ్యంగా కొలతల ప్రకారం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ అంజిరెడ్డి, ఏంపీవో వెంకన్న, హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే. రసూల్, ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని విద్యార్థులు ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు పరెడ్డి సుచరిత అన్నారు. మండలంలోని రాఘవపురం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్వంచ హరికిషన్, గంగ భాస్కర్, అల్లూరి సుదర్శన్, తదితరులు ఉన్నారు.

అడ్డగూడూరు: మండలంలోని జానకీపురం, చౌళ్లరామారం ప్రాథమిక పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు సోమేష్, యాదగిరి ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని ఐసీడీఎస్ భువనగిరి సీడీపీవో స్వరాజ్యం అన్నారు. శనివారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మహిళల సాధికారిత గురించి సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. మహిళలకు ఉన్న చట్టాలు, పథకాలను వివరించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ ఎం. జంగమ్మ, బి. శోభ పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఐసీడీఎస్ అర్బన్-2 సూపర్‌వైజర్ నర్మద అన్నారు. జిల్లా మహిళా శిశు, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రగతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. గర్భిణులు, మహిళా సాధికారత బాల్య వివాహాలు, గృహ హింసా చట్టం, లింగ వివక్ష అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి 1వ తేదీన జీతాలు తమ ఖాతాలో జమ కావడం పట్ల విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ సత్తయ్య, నాయకులు వై రవీందర్, మర్రి బుచ్చిరెడ్డి, కృష్ణమూర్తి, మహమూద్‌ఖాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సోమవరపు మహేశ్వర్, పీఆర్‌టీయూ నాయకులు పాదూరి సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.